# చెట్టుమీద పక్షి

"మాన్స"

వెంకట్రావు ఆంతటితో తన జీవితం అఖరయిపోయిందనుకున్నాడు. ఎంత అవస్థతో, బాధతో, మండుతూ గుండెలు చేత్తో పట్టుకుని ఇంటికొచ్చాడు. ఒచ్చీ రావటంతో సావిట్లో కుర్చీలో కూలబడి నిట్టూరుస్తూ ముఖం మీద చెమట తుడుచుకున్నాడు. కళ్లు మూసుకుంటూంటే శారద గొంతు వినిపించింది.

'ఈ వేళన్నా పంచదార తేవాలన్న జ్ఞానం లేక పోయిందన్న మాట. ఎన్నిసార్లు చెప్పినా ఒక్క ముక్కకూడా జ్ఞాపక ముండదు. ఈ సంసారం చేసేకన్న...'

వెంకట్రావు కళ్లు గిర్రున తిరిగిపోతున్నాయి. బజారు బజారంతా గుండ్రంగా తన చుట్టూ తిరిగిపోతోంది. సూర్యునిచుట్టూ తిరుగుతున్న భూమి తనచుట్టూ తాను తిరుగుతూన్నట్టు వుంది వెంకట్రావు మనస్సు. పంచదార లేదు, లేదు, లేదు, మాని పంచదార కాఫీ, పంచదార లేనందున హోటలు మూసివేయడమైనది, బట్టల షాపులు, కిరాణా షాపులు అన్నీ తలకిందులైనట్టు, గిర్రున తిరుగుతున్నట్టు తను పడిన అవస్థ.

'క్యూ'లో నిలబడడం, చేతులో పన్నెండణాలన్నర పట్టుకున్న వాళ్లకే పంచదార యిస్తానని షావుకారు పెట్టిన గావుకేక, వున్నట్టుండి ఒక గుంపుగా జనం తోసుకొచ్చి తనని నెట్టేసి 'క్యూ'లో సద్దుకోవడం, ఇంతట్లో అందరూ షాపుమీదికి ఎగబడి తొడితొక్కిస లాడుకోవడం, తనూ తెలియకుండానే ఆ గుంపులోకి ఎగబడటం, ఎవరిదో కాలొచ్చి తన గుండెల మీద ఫడాలున తన్నటం, తన్నిన తన్నుతో గుప్పెటలోంచి డబ్బులన్నీ నేలమీద చెల్లా చెదరై పోవటం, వాటికోసం వొంగితే ముక్కులోంచి రక్తం కారుతూండటం; ఎలాగో గుంపులోంచి బయటకడ్డాడు. చుట్టూ చేరిన జనమంతా భయంకరంగా నవ్వుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుకూడా నవ్వుతున్నాడు.

అంతా నవ్వుతున్నది తన అజ్ఞానాన్ని చూసి. పంచదార లేకపోతే గడపలేని అశక్తతను చూసి.

'నాయనా! వారానికి ఒక్కపూట భోజనం మాను...'

అంత కోపంలోనూ ఒళ్లు తెలియని ఆవేదనలోనూ ఫక్కున నవ్వాడు వెంకట్రావు పిచ్చిగా. చుట్టూవున్నవాళ్లు అంతకన్న గట్టిగా ఫకాలున నవ్వుతున్నారు. కళ్లు మూసుకుని కుర్చీలో పడుకుంటే నవ్వుతూన్న తెల్లటి కళ్లవరుసలు క్రూరమైన కోరమీసాలు వేలు, వేలు.

రాత్రి తెల్లవారింది. పక్కదొడ్లో వచ్చే గాలికి వేపచెట్టు తల బరువుగా ఊగుతోంది. కొమ్మమీద గోరింకకూడా గాలితోబాటు వూగుతూ కొమ్మకు తన పట్టు బిగిస్తోంది. వెంకట్రావు తననిగురించి ఆలోచిస్తూ అలా పక్షికేసి చూశాడు. మళ్లీ కోపంతో ఆవేశంతో హృదయము నిండి పోయింది. ఆ దృశ్యం తనని వెక్కిరిస్తున్నట్టు, తన్ను చూసి ఎవరో నవ్వుతున్నట్టు, తన జీవితంకూడా ఓ మహావృక్షానికి అంటుకొని పోయిన గడ్డిపోచలా, తను మరింతమరింత దాన్నే కౌగలించుకుంటుంటే మరింత మరింత తోసేస్తుంటే దూరమైపోతూ ఏదో మహా అగాధంలోకి మునిగి పోతున్నట్టు.

పంజాబ్ మెయిల్ పతనంలాగ జీవితం పట్టాలు తప్పి, ఫిష్ప్లేట్లు తొలగి ఫటేల్ మని పగిలి అగాధాల్లోకి, గోతుల్లోకి. అంతే.

'క్యూలో నిలబడడానికి అభిమానమై చచ్చింది. ఇంక నే నెలా చేసేదీ సంసారం?'

చటుక్కున లేచాడు. చేతులో ఫైళ్ళ కట్ట పుచ్చుకు దభీ దభీ తలమీద రెండు బాదాడు.

గోల్లుమంది శారద. ఏడుస్తుందని తనకి తెలుసు. ఏడవటం తనకిష్టం లేదనీ ఎరుగును. అయినా గత్యంతరం లేదు.

'మూస్తావా లేదా నోరు. చంపేస్తాను.'

ఒకసారి చేతులో వ్రేళ్ల కట్టకేసి చూశాడు. చూసీ చూడటంతోనే తనని పట్టుకున్న ఈ మహావృక్షం ఎంత దారుణాలకి దారి తీయిస్తోందో అర్థమయింది. దాంతో ఏదో సంతృప్తి వెల్లుబికింది. గట్టిగా అరుద్దా మనుకున్నాడు.

'నేను కాదు శారదా నిన్ను కొట్టింది-నిన్ను నా ప్రాణంలో ప్రాణమైన నిన్ను కొడతానా శారదా! నాకు అభిమానం లేదూ! పెళ్లినాడు జ్ఞాపకం తెచ్చుకో. గుర్తుందా అంతమందిలోనూ ఎవరూ చూడకుండా నిన్నెలా గిల్లి నవ్వించానో. ఆ రోజున నేను గిల్లితే నువ్వు నవ్వేదానివి. ఈ రోజున నేను కొట్టిందే కాదా ఏడుస్తావేం శారదా! నేను కాదు నిన్ను కొట్టింది. ఆ మహావృక్షాన్ని కాపాడుతూన్న రాక్షసులు. దేన్నయితే, ఎవర్నయితే మన ప్రాణాలు ఆశ్రయించుకున్నాయో, ఏది మనని తోసేస్తూ రాక్షసత్వం అంచుల దగ్గరికి తీసుకు పోతోందో ఆ చెట్టు వాళ్లు. ఏడవకు. నేను చూడగలను.'

ఆవేదనలో తృప్తి పడ్డాడు. నోరు పెగిలి మాట రావటం లేదు, చేతులను నులుపుకొంటూ నిలబడ్డాడు. ఎంతో దూరంనుంచి ఎన్నో లక్షల కంఠాలు గోల్లున తన చెవిలో గోలచేస్తూ ఏడుస్తున్నట్లు, కోటి రైఫిళ్ళు ఒక్కసారిగా తనమీద విరుచుకు పడుతున్నట్లు, అందరూ తన్ను చూసే నవ్వుతున్నట్లు, 'ఆగండి. ఆగండి. నేను ధ్వంసమై పోతూంటే నవ్వుతారే! నేను చచ్చిపోతున్నాను ఊపిరాట్టం లేదు.'

'అదే మాక్కావలసింది. అదే మేం కోరేది. నువ్వు సంతోషంగా వుంటే మాకేం కావాలి. నువ్వు ధ్వంసమై పోతూంటేనే మా ఆనందం. నువ్వు చనిపోతూంటేనే కాని మేం బతుకుతూండం. మళ్ళీ వేల నవ్వులు. బతికిపోతాడన్న భయంతో ఏడుపులు.

తెల్లవారేసరికి మళ్లా చెట్టుమీద గాలికి ఊగుతున్న పిట్ట దీని మొహం చూడ్డంతోనే దినం ఆరంభమవుతుంది. పిండిమర పిండిమర గుర్తొచ్చింది. ఠక్ ఠక్ ఠక్ ఠక్ 'జీవితం పిండిమర శారదా' నోరు జారి బింకం తగ్గి పైకి అన్నాడు రాజీగా.

'బాగుంది వరస...పిచ్చెక్కిందా ఏం?'

తన బుర్ర ఆలోచనలతో మెషీనులా పని చేస్తూంటే పిచ్చెక్కిందా ?

తక్కున ఆగాడు. అన్నిటికీ శారదేనా ? తిట్లకీ, తన్నులకీ, భోజనానికీ, వేణ్ణీళ్లకీ, ఉపన్యాసాలకీ! ఎవరు శారద తనకి ? తను శారదకేం చేశాడు ? తనింట్లో శారద ఎందుకుండాలి ?

పన్నెండణాలన్నర...మళ్లా జ్ఞాపకం వచ్చింది, రెక్క విరిగిపోయినట్లు, జీవితమే ఆరూపంలో పావుకారు పావు పహారాలముందు మట్టిలో పొర్లాడినట్లు, తనను భగ్నం చెయ్యడానికి ఏదో కుట్ర జరుగుతున్నట్లు, చాలా తియ్యని మాటల్తో తన చేతులో పన్నెండణాలన్నర ఎవరో ఎగరగొట్టినట్లు...

పైకి దయగా కళ్లుపెట్టి, చూపుడు వేలుపైకెత్తి, 'నాయనా, వారానికో పూట వస్తుండరాదూ?'

'వుంటాను స్వామీ, వుంటాను. ఒక పూటేం ఖర్మ...పధ్నాలుగు పూటలు వస్తుంటాను... ఇంత మాత్రందానికి అంత బలవంత పెట్టాలా? ఆదెంత భాగ్యం. మీరు బలవంత పెట్టకపోయినా వుంటాను. ఉండక యేం? మీరు చెప్పనక్కర్లేకుండానే గత మూడు రోజులూ వస్తు. గమనించారా నా బుద్ధి సూక్ష్మత...'

కళ్ళు పైకెత్తి చూశాడు. చెట్టు కొమ్మలన్నీ గాలికి ఊగుతూ ఒకదానితో ఒకటి రహస్యాలాడుతున్నాయి. ఆ చెట్టును చూసేటప్పటికి వెంకట్రావుగుండెల్లో భీభత్సం రేగింది. తుఫాను.

మళ్లీ బయలుదేరి రోడ్డుమీద నడుస్తున్నాడు. దేవాలయం. 'దేవుడంటే నాకేం లెక్కలేదు.' 'గట్టిగా పైకిఅన్నాడు. ఘన విజయం సాధించిన వాడల్లే తృప్తిపడి తల పైకెత్తి చూశాడు.

'ఏమిటీ లెక్కలేదూ. గంగలో దిగు.' పదహారేళ్లమ్మాయి. పట్టు పరికిణీ కట్టుకొని కండువా వేసుకొని, చేతులో పళ్ళెం, పువ్వులూ, తనని చూసి ఫక్కున నవ్వుతోంది.

గభుక్కున పాడు ఆలోచన మెరిసింది వెంకట్రావు బుర్రలో. తరవాత చాలా భయ

మేసింది. చుట్టూ చూశాడు ఎవరేనా ఉన్నారేమోనని...

'ఇంకా చెల్లెలు నాకూ వుంటే ఎంత బాగుండును?' చచ్చిన వాళ్ళ నాన్న చటుక్కున చెయ్యెచ్చుకు ఆపాడు.

'ఏం నాయనా నీ చదువుకి పెట్టింది చాలలేదా ఏమిటి. ఆడపిల్లకి కట్నం ఎక్కడనుంచి తెమ్మన్నావ్? నీ చదువుతో సంసారం...'

'పొరపాటు నాన్నా! చాలా ప్రమాదకరమైన, దేశారిష్టమైన ఆలోచన నాన్నా' ఆగాడు. గట్టిగా అరుద్దామనుకున్నాడు. 'మరి నా పెళ్ళికి వచ్చిన కట్నం?' సమాధానమేమొస్తుందో తెలుసు... 'మరి నీ వుద్యోగానికిచ్చిన లంచం?'

'నెయ్యి లేదు.'

'ఎందుకు లేదు?'

తెలుసు. 'అంతా దొంగనటనే...తనకి తెలీదూ నెయ్యిలేదని! కాని మొగాడైనవాడు అలా అడగాలి. అనకపోతే తృప్తివుండదు. లక్కపిడతల్లో అన్నం వుందా? నాలుగేళ్ల పిల్లలకి తెలీనూ! అయినా వుందనుకోవాలి. అనుకుంటేనే ఆట!

వెంకట్రావు భోజనం చేస్తూ నవ్వుకున్నాడు. చాలా తమాషా చూస్తున్నట్టు, కాలేజీరోజుల్లో చార్లీ చాప్లిన్‌ను చూసినట్టు శారదతో ఏదన్నా అంటూనే. వెంకట్రావు తన ముఖం అద్దంలో చూసుకున్నాడు. శారద ఆరుసంవత్సరాల క్రితం ...కొత్త కాపరం. మంచంమీద కూర్చుని వెంకట్రావు అద్దం చూసుకుంటున్నాడు. 'ఔనుగాని మీరు సినీ హాల్లో చేరకూడదూ?'

'అది ఆరేళ్ల నాటి సంగతి' అరిచాడు వెంకట్రావు గట్టిగా.

'ఏమిటి?' ఆలోచిస్తూ తలపైకెత్తి అంది శారద.

'నేను వెంకట్రావుని. సి. హెచ్. నారాయణరావుని కాదు. తెలిసిందా? ఆరేళ్లయినా అతను బాగానే వుంటాడు: ఆరేళ్ల తరవాత వెంకట్రావుని నేను తెలిసిందా?' అద్దంలో చూసుకుంటూ అరిచాడు.

ఆలోచనలు. ఆ లో చ న లు. తనే పోతే బాగుండును, మెదడు పనిచెయ్యక ఆగిపోయి, గాలిలోకి ఎగిరిపోయి. శూన్యమైపోతే.

మళ్లీ తెల్లవారుతుంది. పిట్ట. చెట్టుమీదపక్షి పిట్ట కూస్తోంది. అవును. అదీఆలోచిస్తోంది. ఎంత భయంకరమైన ఆలోచనలో.

ఎవరో వచ్చి చెవులోచెప్పినట్లయింది. 'ఆ చెట్టును నరికెయ్యరాదూ?'

'నేనా? నేనా! అశక్తి, భయం. కర్రలతో చితకకొట్టేస్తారు. గునపాలతో పొడిచేస్తారు. కొన్నాళ్ళకి చచ్చిపోదూ?' ఆశగా దుర్బలంగా కళ్ళు పైకెత్తాడు.

శరీరంలో శక్తి వుడిగిపోయింది. ఆలసటొచ్చేస్తోంది. కంఠస్వరం నీరసంగా, భయంతో కాళ్లూ చేతులు గడగడ వొణుకుతున్నాయి. తెల్లగా తెల్లగా తెల్లవారినా ఆచెట్టుకేసి చూడటమే భయమేసింది. పారిపోతున్నాడు అంతనూ విడిచి, శారదను, తన ఉద్యోగపుకోటును, కందువాను, చెప్పులు, పన్నెండణాలన్నర- అన్నీ విడిచిపోతున్నాడు. మళ్లీ అదే వినిపించింది.

'ఔనుగాని- ఆచెట్టును నరికెయ్యరాదూ?'

'ఏచెట్టుని?'

అదే నీకు కనిపిస్తున్నదే. నీ జీవితాన్ని గడ్డిపోచచేసి అంటిపట్టుకున్నదే వేళ్లతో సహా.'

'నాకు రావలసిన ఆలోచన కాదది. వొద్దు, ఆచెట్టుకు చుట్టూ ముళ్లకంప, దడి. ఏమో ఇవేమీ లేకపోతే యజమాని లేకపోతే.'

వెంకట్రావు మళ్లీ రోడ్డుమీద నిలబడ్డాడు. చెట్టుచుట్టూ జనం నిలబడ్డారు. గొడ్డళ్ళతో చెట్టుమీదకెక్కుతున్నారు.

'ఏం చేస్తున్నారు?'

చెట్టు యజమాని అన్నాడు: 'నరికేస్తున్నాం'

'ఏమిటి?' సంతోషం కళ్లలో.

'కొన్ని కొమ్మలు వదిలిస్తున్నాం.' నిరాశతో వెంకట్రావు దీనంగా అడిగాడు: 'చెట్టు పూర్తిగా నరికెయ్యరాదటండీ వేళ్ళంటా!'

'నీకేమేనా వెర్రేమయ్యా? ఎవరేనా చెట్టుని నరుక్కుంటారా?'

'కొమ్మలు నరికితే కొత్త చిగుళ్లొస్తాయి. లేతగా అందంగా. మోసం మోసం.'

'అందుకేగా నరుకుతున్నది. ఇంకా ఏపుగా రావటానికి వంకర టింకర కొమ్మలన్నీ పోయి.'

వెంకట్రావు గొంతులోంచి ఏడుపొస్తోంది. చెట్టు ఎక్కుతూన్న వాళ్లను చూస్తూంటే ఏడు

పొడిచింది. 'అయ్యో మోసం. మోసం. మళ్లా కొత్త కొమ్మలొస్తాయి. వేళ్లు ఇంకా దూరంగా దృఢంగా వ్యాపించిపోతాయి భయంకరంగా-పన్నెండణాలన్నరా... అంతా అన్నీ.

'నువ్వెవడివి మధ్యని? వాళ్ళకి నాకూ మధ్య నువ్వెవడివి? ద్రోహి, ద్రోహి, ద్రోహి కూడా.

ద్రోహి, ద్రోహి కూడా నిజమే! తనకా చెట్టు బద్ధశత్రువు. తను చెట్టుకి బద్ధ విరోధి ఇంకా వేళ్ళు పాతుకొంటుంటే చూడగలడా. తనను పీల్చి రక్తం తోడేస్తుంటే. తన కోసం. ఇంకా ఆలోచిస్తే శారదకోసం.

ఎవరు తనూ శారదా? మహేశం ఎవరో? తనే! సుగుణారావు? తనే! ప్రపంచంలో వాటికి తోంభై ఆరువంతులు తనే. వెంకట్రావు శారదా అందర్నీ భయపెట్టడానికి, అణిగి వుండేలా చెయ్యడానికి ఈ చెట్టుకి ఏమి అధికారంవుంది?

కొత్త చిగుళ్లు తొడిగింది. శారద ఆ చెట్టు కేసి చూసి ఉత్సాహంగా, 'ఎంత అందంగా వుందో ఆ చెట్టు' అంది. తెల్లవారిందని లేచాడు వెంకట్రావు.

చప్రున కోపం మండింది 'ఆచెట్టుమీద పక్షిని చూశావా. అది కనిపించడంలేదూ నీకు? ఎందుకు కనిపిస్తుంది అజ్ఞానం అజ్ఞానం.'

'నామీద విరుచుకు పడతారేమిటి?'

'ఇంకెవరి మీద విరుచుకు పడమన్నావ్? చెట్టుకి నేనూ పక్షీ లోకువ. నాకునువ్వు లోకువ. తెలిసిందా? అంతే శారదా ప్రపంచంలో నీ మీదా అందరిమీదా స్వారి చేస్తుందా చెట్టు. అది రంగు మారిందని, మరింత లేత బడిందని సంతోషిస్తున్నావు కాని చుట్టూ ముళ్లపొద చూశానా? కర్రల తడి పోయిందా? పోదు పోదు ఇంకా వేళ్ళు పాతుకునేందుకే కదూ కొమ్మలు నరికింది. యజమానే చెప్పాడు ఆ విషయం వినలేదూ!'

'అదేం చేసింది మిమ్మల్ని?'

'స్వారీ స్వారీ విషం విషం తెలిసిందా?'

రాత్రి చీకటి పడింది. తెల్లటి వెన్నెల పడుతోంది చెట్లమీద. లేత చిగుళ్ళన్నీ సిల్కులా మెరుస్తున్నాయి. గాలికి చెట్టు ఊగుతూ బరువుగా కదులుతోంది. వెంకట్రావు అదిరి పడి లేచాడు. ఏదో పెద్ద భయంకరమైన కలలో చీకట్లే భీభత్సంగా జుట్టు పీక్కున్నాడు. చుట్టూ ముళ్ళ కంచెలు. కర్రల దడులు. మధ్య తను.

తన ముఖం పాలరాతిలో చేసినట్టు తెల్లబడి గట్టిగా మారిపోయింది. తన అరచేతిలో ఎన్నో వేల లక్షల మనుష్యుల బలం. చేతులో పెద్ద గొడ్డలి.

వెనకనుంచి కోటికోట్ల కంఠాలు. 'నరుకు నరుకు' అడుగుతున్నారు.

ఇంకా చిన్న కంఠం. 'నాయనా ఇది కాదు పరిష్కార మార్గం. వారానికి ఒక్క పూట భోజనం మానరాదూ?'

అడుగు తీసి అడుగు పెడుతూంటే భూమి కదిలిపోతూంది.

మూసినకళ్లు పైకెత్తిచూస్తే పిట్ట ఆనందంగా కూస్తూ గాలిలో రెక్కలు విడిలిస్తూ పల్టీలు కొడుతూ ఎగురుతోంది.

శారద వీపుమీద... ఇంకా నిద్రపోతున్న వీపుమీద గట్టిగా చరిచి అన్నాడు: 'శారదా, ఈవేళ పంచదార తెస్తాను. నీకు కావలసినంత. నా కోటూ, కండువా ఇలా పారెయ్ త్వరగా.'

ఇంకో అరగంటలో పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ గబగబ వీధుల్లోకి నడిచి వెళ్లిపోతున్నాడు వెంకట్రావు అమితానందంతో.

అనాదినుండి నేటివరకూ - ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా సరే స్త్రీ ధరించే దుస్తులలో ఒక్కటే ప్రయత్నం గోచరిస్తుంది - నగ్నంగా ఉండాలనే అంతర్లీన వాంఛకూ, బట్టలు ధరించాలనే బహిరంగ వాంఛకూ సమన్వయం——లిన్-యు-టాంగ్.